
జీడిమెట్ల ఇండస్ట్రీ ఏరియాలో రోడ్డుపై వరదనీరు

దంచికొట్టింది!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిజాంపేట్ బండారి లేఅవుట్, సాయినగర్ ప్రాంతాల్లో రోడ్లు వరదనీటితో పొటెత్తాయి. అదే విధంగా జీడిమెట్ల, చింతల్, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, పాపాయ్యయాదవ్‌నగర్, వాజ్‌పేయినగర్, దూలపల్లి వీకర్‌సెక్షన్ కాలనీ ప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు భారీగా చేరింది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– కుత్బుల్లాపూర్


దూలపల్లి 60 గజాల్లో నిలిచిన వరదనీరు


వర్షంతో కేరింతలు కొడుతున్న చిన్నారులు


జీడిమెట్లలో విరిగిన విద్యుత్ స్తంభం


వాజ్‌పేయినగర్‌లో వరదనీరు ఇళ్లల్లోకి చేరకుండా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉప కమిషనర్ నరసింహ


బాచుపల్లి ఆదిత్య గార్డెన్స్‌లో ఓ వీధిలో భారీగా చేరిన వరద

ఆలయ అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తా

నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి


భక్తులు స్వామి వారికి సమర్పించిన గదతో మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు గురువారం మేయర్ నీలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా భక్తులు సమర్పించిన గదా సహిత వామ హస్తాన్ని మేయర్‌కు చూపించారు. ఈ సందర్భంగా మేయర్ నీలారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, నాయకులు రమేష్‌యాదవ్, సుబ్బారెడ్డి, మురళి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

విద్యుత్ అధికారులూ నిర్లక్ష్యం వీడండి..

కంచె, ఫ్యూజ్‌బాక్స్, మీటర్లు అమర్చండి

రంగారెడ్డినగర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షలాది రూపాయాలు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అగమ్యగోచరంగా మారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె శిథిలమయ్యింది. అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌బాక్స్‌కు మూత లేకుండా ప్రమాదకరంగా మారింది.

◆ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన విద్యుత్ మీటర్‌కు రక్షణ కరువైంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసి ఆపై ఫ్యూజ్‌బాక్స్, మీటర్లను అమర్చాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు.

◆ దీంతో విద్యుత్ మీటర్‌ను ఎవరైనా ఎత్తుకెళ్లే ప్రమాదం పొంచి ఉంది. ఇదే రహదారి గుండా నిత్యం వివిధ పాఠశాలలకు వెళ్లే చిన్నారులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎక్కడ తమ పిల్లలు ఫ్యూజ్‌బాక్స్‌ను తాకి ప్రమాదాలను కొనితెచ్చుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు.


గాంధీనగర్ రోడ్డులో స్క్రాప్‌ను తలపిస్తున్న ఫ్యూజ్‌బాక్స్, విద్యుత్ మీటర్

◆ ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కంచె ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సెయింట్ మార్టిన్స్ విద్యార్థినికి రూ.52లక్షల ప్యాకేజ్


విద్యార్థిని శృతికి ఆఫర్ లెటర్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా..

సుభాష్‌నగర్: అత్యుత్తమ స్థాయి సాంకేతిక విద్య నందిస్తూ విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్నామని దూలపల్లి సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ కుమార్ పాత్రా అన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని శృతి ఇటీవల మైక్రోసాఫ్ట్ ఇండియా (ఆర్అండ్‌డీ) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో రూ.52లక్షల ప్యాకేజీకి ఎంపికైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం విద్యార్థిని సంతోష్‌కుమార్ పాత్రా, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ యాదవ్ అభినందించారు.

ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రగతినగర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు

నిజాంపేట్: ప్రగతినగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నంగునూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సభ్యులు గురువారం కాంగ్రెస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రాజేందర్, వీరమల్లి జనార్దన్, కోశాధికారి పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీ మురళీ, కల్చరల్ సెక్రటరీ అల్లాడి మహేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం రాజీవ్‌గృహకల్పలో నివాసముండే ప్రైవేట్ ఉద్యోగి కొత్తపల్లి రామకృష్ణ(37) ఇటీవల ఖమ్మం జిల్లా మదిరలో ఉండే తల్లిదండ్రులకు వద్దకు వెళ్లి తిరిగి వచ్చాడు. అయితే నాలుగు రోజుల పాటు మొబైల్‌లో తల్లిదండ్రులతో మాట్లాడారు. అయితే రెండు రోజులుగా రామకృష్ణ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు సూరారం రాజీవ్‌గృహకల్పలో అతను అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చి చూడగా ఆచూకీ తెలియలేదు. చుట్టుపక్కల వారిని, అతడు పనిచేస్తున్న ఆఫీస్‌లో వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అతడి తల్లి భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


రామకృష్ణ (ఫైల్)

భూజ పీడాసనం.. భగేష్‌కు సత్కారం

సుభాష్‌నగర్: యోగాసనాల్లో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెన్సీ సర్టిఫికెట్ అందుకున్న భగేష్‌ను గురువారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి సత్కరించారు. భూజ పీడాసనం 2నిముషాల 50సెకండ్ల పాటు వేసి రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. యోగాసనాల ద్వారా కుత్బుల్లాపూర్ ప్రాంతానికి ప్రపంచ గుర్తింపు తెచ్చిన భగేష్‌కు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు.


యోగాసనాల్లో గిన్నిస్ రికార్డు సాధించిన భగేష్‌ను సత్కరిస్తున్న సురేష్‌రెడ్డి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. సిబ్బంది సమన్వయలోపం


విద్యుత్ స్తంభం నుంచి పడిన వ్యక్తి వద్ద గుమిగూడిన జనం

సుభాష్‌నగర్: విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తుండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సిబ్బంది సమన్వయలోపంతో కరెంట్ షాక్ తగిలి తాత్కాలిక సిబ్బంది స్తంభం నుంచి పడి గాయపడ్డాడు. గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలోని ద్వారకానగర్ వద్ద గురువారం ఉదయం కాంట్రాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ స్తంభాన్ని అమర్చుతున్నారు.

● ఈ క్రమంలో ఓ తాత్కాలిక సిబ్బంది స్తంభంపై ఎక్కి పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో ఆ సిబ్బంది విద్యుత్ స్తంభం పై నుంచి కిందపడి గాయపడ్డాడు. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగి ఉంటే సదరు సిబ్బంది ప్రాణాలు గాల్లో కలిసేవి.


కరెంట్ షాక్ తగిలి స్తంభం పై నుంచి కింద పడ్డ సిబ్బంది

● ఈ విషయమై సంబంధిత అధికారి ఏఈ చైతన్య భార్గవ్‌ను 'సాక్షి'వివరణ అడగగా మరమ్మతులు చేసిన సమయంలో జనరేటర్ ఆన్ చేయడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలు తప్ప సిబ్బందికి ఏమీ కాలేదని పేర్కొన్నారు.

నాడు చిన్నారిపై.. నేడు తల్లిపై వీధి కుక్కల దాడి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో వీధి కుక్కలు మరోసారి రెచ్చిపోయాయి. గురువారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నిలబడి ఉన్న సరిత (31) గృహిణిని కరిచి గాయపరిచాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల 4వ తేదీన వీరి పాప తన్విహ (5) సైతం దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. ఈ విషయమై బీజేపీ నాయకుడు పొత్తూరి శివాజీరాజు మాట్లాడుతూ.. చిన్నారి ఘటన మరువక ముందే చిన్నారి తల్లిపై వీధి కుక్కలు దాడి చేయడం దురదృష్టకరమన్నారు. ఫిబ్రవరిలో బాధితురాలి కుమార్తె తన్విహపై దాడి జరిగినప్పుడు కొంపల్లి మున్సిపల్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ తూతూమంత్రంగా అధికారులు చర్యలు చేపట్టారన్నారు. బ్లూ క్రాస్ సంస్థతో మాట్లాడి కాలనీలో రెండు వీధి కుక్కలని పట్టుకెళ్లి నాలుగు రోజులు తరువాత ఇక్కడే విడిచిపెట్టారని ఆరోపించారు.

● మున్సిపాలిటీలో పదుల సంఖ్యలో వీధి కుక్కలు దాడులు జరుగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వం వల్ల పిల్లల ప్రాణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు కళ్లు తెరిచి సంఘటన జరిగినప్పుడు హడావిడి చేయడం కాకుండా శాశ్వత ప్రాతిపదికన వీధి కుక్కలని కట్టడి చేసే ప్రణాళికపై దృష్టి పెట్టాలని శివాజీ రాజు డిమాండ్ చేశారు. గతంలో ఇదే కాలనీలో 50 పైచీలుకు వీధి కుక్క కాటుకు గురైన ఘటనలు చోటు కున్నాయి. ఇంట్లో నుంచి బయటకు రావడానికి స్థానికులు భయాందోళన చెందుతున్నారని అన్నారు. చేతిలో కర్ర లేనిదే బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు.


కుక్కల దాడిలో మహిళ కాలికి గాయమైన దృశ్యం

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం


రింగ్ బస్తీలో రాళ్లు కొట్టి ప్లాట్ చేసిన దృశ్యం..

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ స్థలాల్లో బండరాళ్లు కొట్టే నెపంతో కొందరు లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలాల ఆక్రమణలకు పాల్పడుతున్నారు. జగద్గిరిగుట్ట సర్వే నం.384/1లో కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు బండరాళ్లు కొడుతూ సదరు స్థలాలను ప్లాట్లు చేసి విక్రయాలు చేపడుతున్నారు. అదే విధంగా కొట్టిన రాళ్లను కొడుతూ వాటిని విక్రయించడంతో పాటు స్థలాల అక్రమ దందాకు తెరలేపారు. జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం పక్కగా ఉన్న ఈ స్థలం, రింగ్ బస్తీలో ఈ తతంగం బహిరంగంగానే కొనసాగుతోంది. ఈ విషయమై రెవెన్యూ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.


జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో..

విజయవంతంగా అరుదైన శస్త్రచికిత్స


రోగి బ్లెస్సీడిబోరాతో అరుంధతి ఆస్పత్రి ఫౌండర్ మర్రి లక్ష్మారెడ్డి, డా. హర్షవర్ధన్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన బ్లెస్సీడిబోరా(22) అనే మహిళ గుండె మూడు రెట్లు వేగంగా కొట్టుకునే సమస్యతో బాధపడుతోంది. పలు చోట్ల చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో చేరింది. కార్డియాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో వైద్య బృందం ఎలక్ట్రోఫిజియాలజికల్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్‌ను ఉపయోగించి చికిత్స చేశారు.

● ఈ సందర్భంగా రోగి బ్లెస్సీడిబోరా మాట్లాడుతూ.. పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నా సరైన చికిత్స చేయకపోవడంతో ఆలస్యమైందిదన్నారు. చికిత్సకు రూ.2 లక్షలు ఖర్చవుతుందని తెలపడంతో ఆర్థిక స్తోమత లేని తాము అరుంధతి ఆస్పత్రిలో చేరామన్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని ఉచిత వైద్యం అందజేసిన ఆస్పత్రి యాజమాన్యానికి రుణపడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఫౌండర్ మర్రి లక్ష్మారెడ్డి, వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాలుష్యానికి కేరాఫ్ గంపలబస్తీ.!

- అనుమతులు లేకున్నా నడుస్తున్న యూనిట్‌లు
- మున్సిపల్, పీసీబీ అధికారుల అండదండలు
- నివాసాల మధ్య నుంచి తరలించాలంటున్న స్థానికులు


గంపలబస్తీ వ్యూ..

జీడిమెట్ల: ఆ బస్తీలో అడుగు పెడితే అన్నీ రీసైక్లింగ్ యూనిట్‌లే.. ఎక్కడ చూసిన రసాయన డ్రమ్ములు, ప్లాస్టిక్ కవర్లు.. బస్తీలో అడుగు పెడితే రసాయనాల దుర్వాసన.. అక్కడ నాలాల్లో మురుగునీటి కంటే రసాయనాలు ఎక్కువగా పారుతుంటాయి.. అలా అని ఈ బస్తీ ఎక్కడో నగరానికి బయట లేదు నివాసాలకు, కాలనీకి అనుకునే సుభాష్‌నగర్‌లో ఉంది. ఇక్కడ రీసైక్లింగ్ యూనిట్‌లు నిర్వహించే యజమాని ఏ ఒక్కరూ కూడా బస్తీలో ఉండరు. కానీ ఇక్కడ ప్రాంతంలో కాలుష్యానికి పాల్పడుతుంటారు.

ఉన్నవన్నీ అనుమతులు లేని రీసైక్లింగ్ పరిశ్రమలే..

సుభాష్‌నగర్‌లోని గంపలబస్తీలో దాదాపు రెండు వందల పైచిలుకు రీసైక్లింగ్ పరిశ్రమలు ఉంటాయి. వీరంతా వివిధ రసాయన పరిశ్రమల నుండి డ్రమ్ములు, ప్లాస్టిక్ కవర్లను కొనుగోలు చేస్తారు. వాటిని యూనిట్‌లకు తరలించి రీసైక్లింగ్ పరిశ్రమల్లో వాటిని శుభ్రపరిచి వాటిని తిరిగి విక్రయిస్తుంటారు. శుభ్రపరిచే క్రమంలో వెలువడిన రసాయనాలను నేరుగా పక్కనే ఉన్న నాలాల్లోకి వదిలేస్తారు. ఇలా చేయడం వలన భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి.

◆ **అధికారులు పట్టించుకోరు**

అధికారులు పట్టించుకోరు. వారిచ్చే అమ్యామ్యాలు తీసుకుని మిన్నకుండిపోతారు. రీసైక్లింగ్ వలన వాయు, శబ్ద, భూగర్భ జలాలు కలుషితం అవుతున్నప్పటికి అధికారులు మాత్రం పట్టించుకోరు. ఇప్పటికే సదరు రీసైక్లింగ్ పరిశ్రమలపై వందల ఫిర్యాదులు అధికారులకు అందాయి. అప్పటికప్పుడు అధికారులు హడావిడి చేసి ప్రతినెలా వారిచ్చే అమ్యామ్యాలు తీసుకుని మిన్నకుండిపోతున్నారని పర్యావరణ పరిరక్షకులు అంటున్నారు.


పక్కనే ఉన్న సుభాష్‌నగర్ కాలనీ..

◆ **సుభాష్‌నగర్ నుంచి తరలించండి..**

ప్రతినిత్యం కలుష్యాన్ని వెదజల్లే రీసైక్లింగ్ పరిశ్రమలను గంపలబస్తీ నుంచి తరలించాలని సుభాష్‌నగర్ ప్రజలు కోరుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రసాయనాలను నేరుగా నాలాల్లోకి వదులుతుంటారు. దీని వలన కాలనీల్లో తీవ్రమైన దుర్వాసన వెలువడుతుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రీసైక్లింగ్ పరిశ్రమలను సుభాష్‌నగర్ నుంచి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

పీసీబీ అధికారులు పట్టించుకోవాలి..




మేము పదేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. నాలాలో రసాయనాలు పారడంతో దుర్వాసన వెలువడుతుంది. ఒక్కోసారి ఇంటి తలుపులు మూసినా దుర్వాసన పోదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సుభాష్‌నగర్‌లో ఉన్న రీసైక్లింగ్ పరిశ్రమలను నివాసాల మధ్య నుంచి తరలించాలి. పీసీబీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలి.

– వెంకటరెడ్డి, సుభాష్‌నగర్

బదిలీ.. పైరవీ!

- ఎలక్షన్ కోడ్ ముగియగానే బదిలీలు తప్పవా?
- నచ్చిన చోట పోస్టింగ్ ఇప్పించుకునేందుకు పైరవీలు కొనసాగుతాయా?
- పోస్టింగుల్లో ప్రజాప్రతినిధుల సిఫారసులు ఉంటాయా?
- లేక పారదర్శకంగా బదిలీలు, పోస్టింగ్‌లు ఉంటాయా?



కుత్బుల్లాపూర్: ఎన్నికల ముందు ఆయా విభాగాల అధికారులు బదిలీల పరంపర సర్వ సాధారణంగా ఉంటాయి. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తిరిగి అదే పోస్టులో కొత్త వ్యక్తులను పైరవీలు చేసి నియమించడం జరుగుతూ వస్తున్నాయి. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో అటు బాలనగర్ ఇటు మేడ్చల్ డివిజన్ల పరిధిలో ఉన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు అందులో భాగంగానే వచ్చిన వారు అధికంగా ఉన్నారు. వారు కంటిన్యూగా ఉంటారా.. లేదా రాజకీయ ఒత్తిళ్లతో బదిలీల పరంపర కొనసాగుతుందా.. అన్న విషయం తేలాల్సి ఉంది.

◆ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి పైరవీలకు ఎటువంటి ఆస్కారం ఇవ్వకుండా బదిలీలు చేపట్టాలని ఆయా కమిషనర్లకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ముక్కుసూటి వ్యక్తిగా పేరున్న సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఎటువంటి విమర్శలకు తావివ్వకుండా ఎన్నికల నిబంధన మేరకు ఆయా పోలీస్ స్టేషన్లకు ఎస్‌హెచ్‌ఓలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

◆ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ ఎమ్మెల్సీ అన్ని తానై వ్యవహరించి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో చక్రం తిప్పినట్లు గుసగుసలు వినిపించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ పైరవీలకు చెక్ పెడుతూ స్వతంత్రంగా బదిలీలు కొనసాగించారు.

అంత వరకు బాగానే ఉన్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు ఉండటంతో ఫలితాల తర్వాత స్థాన చలనం ఉంటుందా.. ఉండదా.. అన్న విషయంపై ఇప్పుడు కొంతమంది ఎస్‌హెచ్‌ఓలు డైలామాలో ఉన్నారు.

◆ నియోజకవర్గంలో సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ ముగ్గురు మార్చి నెలలో బాధ్యతలు చేపట్టారు. దుండిగల్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు జనవరి నెలలో వచ్చారు. పైన పేర్కొన్న అయిదుగురు ఇన్‌స్పెక్టర్లు ఎన్నికల ముందు వచ్చి చేరిన వారే.

◆ ఇదే క్రమంలో జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ 2023 ఏప్రిల్ నెలలో బాధ్యతలు చేపట్టగా ఎన్నికల సందర్భంగా కొనసాగిస్తూ వచ్చారు. ఎన్నికల ఫలితాల అనంతరం పైరవీలకు పెద్దపీట వేసి ఇతర ఇన్‌స్పెక్టర్లు ఈ ప్రాంతంపై ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029